2లో

మార్చి 4వ తేదీన కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

2లో

మేడారం జాతరపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్..

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక - 57 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 04 రూ - 03/- సోమవారం 26 ఫిబ్రవరి 2024

తెలంగాణలో రెండు రోజులు వానలు..!

హైదరాబాద్,ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో రెండురోజులపాటు వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని పేర్కొంది.ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇవాళ ఉదయం వరకు రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్, ములుగు, నల్గొండలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదైంది.

మీడియా అకాడమీ చైర్మన్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మరో అడుగు వేసింది. ఈ మేరకు మీడియా అకాడమీ చైర్మన్‌గా కె.శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవీలో కొనసాగుతారు. ఈ మేరకు స్పెషల్ సెక్రటరీ ఎం. హనుమంత రావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. మీడియా అకాడమీ చైర్మన్ కేబినెట్ ర్యాంక్ హోదా పొందుతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఆయన ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పని చేశారు. గతంలో విశాలాంధ్ర పత్రికకు, మనతెలంగాణ దినపత్రిక వ్యవస్థాపక ఎడిటర్‌గా కె. శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. ప్రస్తుతం ప్రజా పక్షం పత్రికకు కె.శ్రీనివాస్ రెడ్డి ఎడిటర్‌గా ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో అల్లం నారాయణ మీడియా అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు.

కాంగ్రెస్ గెలుస్తుందని.. రేవంత్ రెడ్డి సొంతూరోళ్లే అనుకోలే: కెటిఆర్

అచ్చంపేట,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితాడని ముందే చెప్పి ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి 30 సీట్లు కూడా రాకపోతుండే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో భాగంగా ఆదివారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ పాల్గొని మాట్లాడారు. రేవంత్ రెడ్డి సొంత ఊరు కొండారెడ్డిపల్లిలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఎవరు అనుకోలేదని చెప్పారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి లెక్క మాట్లాడడం లేదు. లంకె బిందెల దొంగ లెక్క మాట్లాడుతున్నాడని విమర్శించారు. లంకె బిం దెల కోసం దొంగలు అర్ధరాత్రి తిరుగుతారు.. కానీ సచి వాలయంలో రాజకీయ నాయకులు తిరగరని చరుకలు అంటి ంచారు. మిషన్ భగీరథను నిర్వహించే తెలివి కూడా ఈ ప్రభు త్వానికి లేదని మండిపడ్డారు కెటిఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకులే అధికారంలోకి వస్తామని అనుకోలేదని అందుకే అడ్డగోలుగా హామీలు ఇచ్చారని దుయ్యబట్టారు. అప్పుడేమో అందరికీ అన్ని.. ఇప్పుడేమో కొందరికి మాత్రమే ఇస్తామం టున్నారని ఆయన అన్నారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీ.. ఆడబిడ్డలకి ప్రతినెలా రూ.2,500.. ఇంట్లో అవ్వతాతలకు ఇద్దరికీ రూ.4,000 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు.ఎలక్షన్ కమిషన్ లెక్క ప్రకారం.. ఒకటి కాదు రెండు కాదు కోటి 67 లక్షల మంది ఆడబిడ్డలున్నారని వాళ్లందరికీ నెలకు రూ.2,500 ఎప్పుడిస్తారని ఎదురుచూ స్తున్నా రన్నారు. 500 రూపాయలకే సిలిండర్ అన్నారు. కోటి 24 లక్షల గ్యాస్ సిలిండర్ కనెక్షన్లు ఉన్నాయి. వాళ్ళందరూ ఎదురు చూస్తున్నారని చెప్పారు.ఎన్నికల సమయంలో 200 యూనిట్ల వరకు ఉచితంగా అందరికీ అన్ని ఇస్తా అన్నారని.. కానీ ఇప్పుడు కొందరికే అంటున్నారని మండిపడ్డారు. వందరోజుల పాటు ప్రభు త్వానికి అవకాశం ఇద్దాం అనుకున్నా ము. శ్రీకృష్ణుడు శిశుపాలుడి 100 తప్పులు లెక్కపెట్టినట్లు ఆగుదా మనుకున్నాం.. కానీ తొలి అసెంబ్లీ సమావేశంలోనే మా పార్టీ పైన, మా పార్టీ అది నేత పైన అడ్డ గోలుగా విమర్శలు చేశారని కెటిఆర్ ఫైర్ అయ్యారు. కేసీఆర్ చరిత్రను ఎవరు చెరిపేయలేరని ఆయన అన్నారు.

కాంగ్రెస్ స్కామ్‌లకు అంతులేదు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): దేశంలో టెలికం వ్యవస్థ నిర్మాణం అవసరం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ హయాంలో 2 జి స్కామ్ జరిగింది. ఇక క్రీడోత్సవాల దశలో కామన్‌వెల్తు స్కామ్ దూసుకువచ్చిందని గుర్తు చేశారు. అభివృద్ధి పనులను కాంగ్రెస్ పాలనలో కేవలం తమ స్వార్థానికి వాడుకున్నారని, పనులు ముందుకు సాగలేదని ప్రధాని మోడీ విమర్శించారు. దేశ అత్యంత కీలకమైన రక్షణ వ్యవస్థ, భద్రతా వ్యవస్థల బలోపేతం అనివార్యం

వివరాలు 2లో

28న మేడారంలో తిరుగు వారం పండుగ..

ములుగు,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ముగిసింది. తిరిగి 2026లో ఈ మహాజాతర జరగనుంది. జాతరకు 1.45 కోట్ల మంది భక్తులు వచ్చారని అధికారులు వెల్లడించారు. సంప్రదాయం ప్రకారం ఈ నెల 28న సమ్మక్క-సారలమ్మకు తిరుగు వారం పండుగ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా మేడారం గ్రామస్థులు, ఆదివాసీలు, పూజారుల కుటుంబీకులు ఇళ్లను శుద్ధి చేసి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు.ఇక మేడారం జాతరలో ధరలు ఆకాశాన్ని తాకాయి. వాటర్ క్యాన్ నుంచి కూల్ డ్రింక్ ధరలు భారీగా పెంచేసి అమ్మడంతో భక్తులు లోబోదిబోమన్నారు. సరఫరా కష్టంగా ఉండటంతో ధరలు పెంచేసి అమ్ముతున్నామని వ్యాపారులు చెప్పుకొచ్చారు. 20 లీటర్ల వాటర్ క్యాన్ ధర రూ. 150 పలుకగా.. ఒక్కో బీరు రూ.280-300కు విక్రయించారు. అవసరాన్ని ఆసరాగా చేసుకుని మొబైల్ ఛార్జింగ్ గంటకు రూ.50-70 వసూలు చేసారని భక్తులు ఆవేదన వ్యక్తం చేసారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తులేదు.. కాంగ్రెస్ పార్టీకి నాయకుడు లేడు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్తు లేదని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు లేడంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్, బీజేపీలపై సైటర్లు వేశారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మొదటివారంలో పార్లమెంట్ ఎన్నికలు రాబోతున్నాయంటూ జోష్యం చెప్పారు.బీఆర్ఎస్ తెలంగాణలో ఒక్కసీటు గెలవకున్న నష్టం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీలంటూ మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ అబద్ధపు ప్రచారాలు చేస్తుందని దీనిని ప్రజలు గమనిస్తు న్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల్లో బీజేపీని దెబ్బతీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17కి 17సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్‌ని ఇంటికి పంపించడం గ్యారంటంటూ చవాక్కులు పేల్చారు. రాహుల్ గాంధీ ఎంపీ ఎన్నికల తర్వాత విదేశాలకు వెళ్ళిపోతారంటూ, కాంగ్రెస్ పార్టీకి నాయకుడు లేడని సైటర్లు వేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే వృథా అయినట్టేనని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసే సత్తా రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఇంకో రెండు నెలలు అయితే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే నాయకులను గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు.

రాహుల్ యాత్రలో చేరిన అఖిలేశ్ యాదవ్

- ఆదివారం ఆగ్రా యాత్రలో భాగస్వామిగా ఎస్‌పి చీఫ్
- ఎస్‌పి, కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు అనంతర పరిణామం

ఆగ్రా,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆదివారం ఆగ్రాలో రాహుల్ గాంధీ సారథ్యంలోని 'భారత్ జోడో న్యాయ్ యాత్ర'లో చేరారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఉత్తర ప్రదేశ్‌లో ఎస్‌పి, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకం ఒప్పందం కుదిరిన కొన్ని రోజులకు ఈ పరిణామం సంభవించింది. ఎస్‌పి, కాంగ్రెస్ కార్యకర్తలు ఇద్దరు అగ్ర నేతలకు మద్దతుగా నినాదాలు చేశారు. ఇద్దరు నేతలు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రాతో కలసి యాత్ర కోసం చేరిన జనం వైపు చేతులు ఊపారు.ఈ సందర్భంగా ప్రసంగించిన అఖిలేశ్ యాదవ్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఇప్పుడు రైతులు ప్రభు త్వానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. రైతుల బలానికి ప్రభుత్వం బెదురుతోంది. రానున్న కాలంలో బిజెపికి అధికార చ్యుతి కలుగుతుంది. ఇండియా కూటమి ప్రభుత్వం రైతులకు గౌరవం ఇస్తుంది'

వివరాలు 2లో

గ్యాస్ పథకానికి రూ.80 కోట్లు నిధులు విడుదల...

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ.80 కోట్ల విడుదలకు అనుమతిస్తూ పౌరసరఫరాల శాఖ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది.ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రూ.500 సిలిండర్ పథకాన్ని 27న ప్రారంభిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే.నిధుల విడుదలకు అనుమతి స్తూ పౌర సరఫరాల శాఖ పాలనాపరమైన ఉత్తర్వులిచ్చింది.

కాంగ్రెస్ స్కామ్‌లకు అంతులేదు

(మొదటి పేజీ తరువాయి)

దశలో కాంగ్రెస్ పాలనలో హెలికాప్టర్లు, సబ్‌మెరైన్‌లు, యుద్ధ విమానాల స్కామ్‌లు జరిగాయని తెలిపారు.దేశ ప్రజల ప్రతి అవసరంతో సయ్యాటలకు దిగడం కాంగ్రెస్‌కు పవర్‌తో అబ్బిన విద్య అయిందన్నారు. ఈ దేశం దోపిడికి గురి కాకుండా చూస్తానని తాను అధికారంలోకి రాగానే హామీ ఇచ్చానని, ఈ దిశలోనే సాగుతున్నానని వివరించారు. దీవి ప్రాంతపు ద్వారకకు భూతల ఒకాకు మార్గ అనుసంధానం తేలిక చేసే తీగల వంతెన ఇప్పుడు ముందుకు వచ్చిందని వివరించారు. ఇక్కడ వెలిసిన సుదర్శన సేతు కేవలం రాకపోకల వంతెన కాకుండా అత్యద్భుత ఇంజనీరింగ్ నిర్మాణ పని. ఇప్పుడు ఇది వెలియడంతో ప్రయాణికులు , ఇక్కడికి వచ్చే విశేష కృష్ణ భక్తులు ఇకపై పడవలపై ద్వారకానాథుడిని చూసేందుకు వెళ్లే రోజులు గతించాయి.ఇక ఈ వంతెన ద్వారా తమ మజిలీ చేరుకోవచ్చునని ఈ వంతెన విశేషాలను ప్రధాని ప్రస్తావించారు. తాను గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ఇటువంటి వంతెన అవసరాన్ని పలు సార్లు కాంగ్రెస్ ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చానని , కానీ వారు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పుడు తన హయాంలో పని ఆరంభం అయ్యి, వంతెన ప్రజలకు అందుబాటులోకి రావడం తన పరమ అదృష్టంగా భావిస్తున్నానని మోడీ ప్రకటించారు.

రాహుల్ యాత్రలో చేరిన అఖిలేశ్ యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

అని అఖిలేశ్ చెప్పారు. వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీ వర్గాలకు సముచిత గౌరవాన్ని బిజెపి ఇవ్వలేదని అఖిలేశ్ ఆరోపించారు. ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత ప్రదీప్ మాథుర్ కూడా ఈ యాత్రకు హాజరయ్యారు. 'రాహుల్‌జీ, ప్రియాంకజీ, అఖిలేశ్‌జీ నాయకత్వంలో మేము లోక్‌సభ ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలు సాధిస్తాం' అని ప్రదీప్ మాథుర్ ధీమా వ్యక్తం చేశారు.

నోటీసులు రద్దు చేసుకోండి.. నేను విచారణకు రాలేను: సిబిఐకి కవిత లేఖ

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్):సిబిఐకి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత షాకిచ్చారు. తాను ఫిబ్రవరి 26న విచారణకు రాలేనని తేల్చి చెప్పారు. 41సీఆర్పీ నోటీసులు రద్దు చేసుకోండి.. లేద ఉపసంహరించుకోండని సిబిఐకి కవిత తెలిపింది. ఢిల్లీ లిక్కర్ కేసులో సోమవారం విచారణకు హాజరుకావాలని ఇటీవల సిబిఐ.. కవితకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో తాను విచారణకు రాలేనని చెబుతూ సిబిఐకి ఆమె లేఖ రాశారు. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉన్నందున తాను విచారణకు హాజరుకాలేనని స్పష్టం చేశారు. ఎమైనా సమాచారం కావాలంటే వర్చువల్ గా అందుబాటులో ఉంటానని లేఖలో తెలిపారు. అయినా, సిబిఐ అరోపణలో తన పాత్ర లేదని.. ఎన్నికలకు ముందు నోటీసులు ఇవ్వడంపై అనుమానాలు ఉన్నాయని కవిత ఆరోపించారు.కాగా, ఈడీ కూడా కవితకు నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో రెండు సార్లు విచారించిన అనంతరం.. ఈడీ అధికారుల విచారణ తీరుపై అభ్యంతరం తెలుపుతూ కవిత..సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కవిత పిటిషన్ సుప్రీంలో పెండింగ్ లో ఉంది.

మార్చి 4వ తేదీన కేంద్ర మంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటన

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణలో మార్చి 4వ తేదీన పర్యటించనున్నారు. బిజెపి చేపట్టిన విజయ సంకల్పయాత్ర ముగింపు సభలో పాల్గొననున్నారు. ఈ నెల 24వ తేదీన జరగాల్సిన అమిత్ షా పలు కారణాలతో పర్యటన రద్దు అయింది. దీంతో మార్చి 4న ఆయన తెలంగాణకు రానున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో ఆపార్టీ 10 ఎంపీ సీట్లు గెలవాలని లక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర చేపట్టింది. ఈ యాత్ర కోసం రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించింది. ఐదు క్లస్టర్లలో యాత్ర మొదలుపెట్టి చివరగా హైదరాబాద్‌లో ముగించనున్నారు. ఈ యాత్రలో ఆ పార్టీ అగ్రనేతలతో పాటు జాతీయ నాయకులు పాల్గొంటారు. విజయసంకల్ప యాత్ర మార్చి 4వ తేదీన ముగియనుంది. యాత్ర ముగింపు సభను భారీగా నిర్వహించేందుకు బిజెపి ప్లాన్ చేసింది.

తెలంగాణలో రైల్వే రూపురేఖల్ని సమూలంగా మార్చేస్తాం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణలో రైల్వే లైన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో రైల్వే రూపురేఖల్ని సమూలంగా మార్చివేస్తామని చెప్పారు. రైల్వేస్టేషన్లను ఆధునికీకరించి, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. 'అమృత్‌భారత్ స్టేషన్ల పథకం కింద దేశవ్యాప్తంగా 500కు పైగా స్టేషన్ల పునరాభివృద్ధి పనులకు సోమవారం (ఫిబ్రవరి 26న) ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని చెప్పారు.సౌత్ సెంట్రల్ రేల్వే జోన్‌లో ఆయా డివిజన్లలో రూ.221 కోట్లతో ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న 3 రైల్ ఫ్లైఓవర్లను, 29 రైల్ అండర్‌పాస్‌లను జాతికి

అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. ఇందులో తెలంగాణలో రూ.230 కోట్లతో చేపట్టే 15 రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులు, రూ.169 కోట్లతో చేపట్టే ఒక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) సహా 16 అండర్‌పాస్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ల పనులు ఉన్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో స్టేషన్ల పునరాభివృద్ధి, ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు మొత్తం రూ.2,245 కోట్లను కేంద్రం కేటాయించిందని చెప్పారు.ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయని అన్నారు. 40 అమృత్‌భారత్ స్టేషన్లకు గత ఆగస్టులో భూమిపూజ చేశారని వెల్లడించారు. 2014-15 రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.258 కోట్లు కేటాయించగా.. 2024-25లో రూ.5,071 కోట్లకు పెంచామని కిషన్ రెడ్డి వెల్లడించారు. చర్లపల్లి రైల్వే టెర్మినల్ పూర్తయిందని.. మార్చి మొదటి వారంలో ప్రధాని మోదీ ఈ టెర్మినల్‌ను ప్రారంభిస్తారని చెప్పారు.

బిఆర్ఎస్‌లో జరుగుతున్న అవమానాన్ని భరించలేక కాంగ్రెస్‌లో చేరిక

- తెలంగాణ ఉద్యమకారులను బిఆర్ఎస్ విస్మరించింది - ఆనాడు చట్టసభల్లో తెలంగాణ కోసం పోరాడింది కాంగ్రెస్ ఎంపిలే

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): బిఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న అవమానాన్ని భరించలేక కాంగ్రెస్ పార్టీలోకి నాయకులు వస్తున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన జిహెచ్ఎంసి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి దంపతులకు మంత్రి పొన్నం శుభాకాంక్షలు తెలిపారు. గాంధీభవన్‌లో మోతే శ్రీలత శోభన్ రెడ్డితో పాటు మరో ఆరుగురు కార్పొరేటర్లు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి శ్రీలత శోభన్ రెడ్డి మంచిపనిచేశారని ఆయన అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో వచ్చిన బిఆర్ఎస్ పార్టీ అమరుల త్యాగాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసుకొని తెలంగాణ ఉద్యమకారులను విస్మరించిందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను సంక్షేమ అభివృద్ధి వైపు నడిపించేందుకు కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి నాయకుడికి సముచిత స్థానం ఉంటుందని ఆయన హామినిచ్చారు. ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల ఆధారంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడిందని ఆయన తెలిపారు. ఆనాడు చట్టసభల్లో తెలంగాణ కోసం పోరాడింది కాంగ్రెస్ ఎంపిలేనని ఆయన అన్నారు. ఎప్‌డిఐపై ఓటింగ్ జరుగుతున్నప్పుడు తాము ఓటెయ్యమని చెప్పామన్నారు. తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటేనే తాము ఓటేస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు. సుష్మాస్వరాజ్ ను తాము ఒప్పించి బిల్లుకు మద్దతు పలికేలా చేశామన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టే సందర్భాన్ని లైవ్ టెలికాస్ట్ ఇవ్వొద్దని ఐబి తప్పుడు

రిపోర్ట్ ఇచ్చిందన్నారు. గొడవలు జరుగుతాయని తప్పుడు నివేదిక ఇవ్వడంతో లైవ్ ఇవ్వలేదని మంత్రి పొన్నం వివరించారు. ప్రాసెస్ ప్రకారమే బిల్లు ప్రవేశపెట్టే సమయంలో చట్ట సభలో సభ్యులు బయటకు, లోపలికి తిరగకుండా తలుపులు మూస్తారని ఆయన తెలిపారు. కానీ, ప్రధాని మోడీ తలుపులు వేసి బిల్లు ప్రవేశపెట్టారని చెప్పడం సరికాదని పొన్నం పేర్కొన్నారు.

లాస్య నందిత కుటుంబాన్ని పరామర్శించిన కెటిఆర్

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): దివంగత ఎంఎల్ఎ లాస్య నందిత కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ పరామర్శించారు. ఆదివారం ఉదయం కెటిఆర్ మాజీ మంత్రులు మహమూద్ అలీ, మల్లారెడ్డితో కలిసి కారా?నాలోని ఆమె నివాసానికి వెళ్లి నందిత చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. లాస్య నందిత తల్లి, సోదరిని ఓదార్చారు.అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మరణించారన్న వార్త విని షాక్కు గురయ్యానని చెప్పారు. దురదృష్టవశాత్తు తాను విదేశాల్లో ఉండటం వల్ల ఆమె అంత్యక్రియలకు రాలేకపోయానని తెలిపారు. లాస్య నందితను గత 10 రోజులుగా అనేక ప్రమాదాలు వెంటాడాయని పేర్కొన్నారు. ఏడాది క్రితమే ఆమె తండ్రి సాయన్న మరణించారని తెలిపారు. నందిత కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు.

మేడారం జాతరపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ట్వీట్..

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ప్రశాంతంగా ముగిసింది. గద్దెలపై కొలువుదీరిన తల్లులను లక్షలాది మంది భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం సాయంత్రంతో జాతర ముగిసింది. మళ్లీ రెండేళ్లకు జాతరకు మళ్లొస్తం తల్లీ అంటూ భక్తులు ఇండ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. జాతరపై టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు. లక్షలాది మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని.. మొక్కులు సమర్పించుకున్నారని తెలిపారు. బస్సుల్లో తిరిగి క్షేమంగా తమ సొంతూళ్లకు చేరుకున్నారన్నారు.మేడారం జన జాతరకు వచ్చే భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ కుటుంబానికి అభినందనలు తెలిపారు. అతి తక్కువ సమయంలోనే మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించి.. భక్తులకు అసౌకర్యం కలిగించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. మహాలక్ష్మి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ స్కీమ్‌ను జాతరలో సిబ్బంది విజయవంతంగా అమలు చేశారన్నారు. ఈ జాతరలో ప్రతి ఒక్క సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించి.. ఉన్నతస్థాయి వృత్తి నైపుణ్యాన్ని కనబరిచారన్నారు.లక్షలాది మంది భక్తులను జాతరకు చేర్చే కీలకమైన, సంక్లిష్టమైన పనిని సమష్టి కృషితో విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ప్రయాణ సమయంలో భక్తులు ఆర్టీసీ సిబ్బందికి ఎంతగానో సహకరించారని.. పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రజా రవాణా వ్యవస్థను ఆదరిస్తున్నామని, ప్రోత్సహిస్తున్నామని మరోసారి నిరూపించారంటూ కొనియాడారు. మేడారం మహాజాతరలో ఆర్టీసీ సేవలను వినియోగించుకుని, సిబ్బందికి సహకరించిన భక్తులందరికీ ప్రత్యేక సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ

హైదరాబాద్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఆర్టీసీ విలీనానికి సంబంధించి అపాయింట్‌మెంట్ డే ప్రకటించలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అపాయింటెడ్ డే అమలు చేయాలన్నారు. ప్రభుత్వంతో విలీనం చేస్తూ తక్షణం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు సర్వీసులతో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై భారం పడుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఖజానా నుంచి జీతాలు ఇవ్వాలన్నారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. 2013 పీఆర్సీ బాండ్స్‌కు పేమెంట్ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని.. బాండ్స్‌కు అనుగుణంగా నగదు చెల్లింపులు చేయాలన్నారు.

తొలిసారి ఓటర్లు రికార్డు సంఖ్యలో ఓట్లు వేయాలి

- వారి తొలి వోటు దేశం కోసం కావాలి

- యువజనులకు ప్రధాని మోడీ పిలుపు

- 'మన్ కీ బాత్'కు 3 నెలలు విరామం

- లోక్‌సభ ఎన్నికల దృష్టా మార్చి నుంచి ప్రసారం ఉండదు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్టా రాజకీయ నైతిక విలువల ప్రకారం తన నెలవారీ 'మన్ కీ బాత్' వచ్చే మూడు నెలలు ప్రసారం కాదని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం ప్రకటించారు. నెలవారీ 'మన్ కీ బాత్' కార్యక్రమం 110వ ఎపిసోడ్‌లో మాట్లాడిన ప్రధాని మోడీ తొలిసారి వోటర్లు ఎన్నికలలో రికార్డు సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. వారి తొలి వోటు దేశం కోసమే పడాలని ఆయన సూచించారు. సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్/ మేలో జరగవచ్చునని భావిస్తున్నందున 2019లో వలె ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసిసి) మార్చిలో అమలులోకి వచ్చే అవకాశం ఉందని మోడీ చెప్పారు. ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే నెల ప్రకటించే అవకాశం ఉన్నది.అధికార పార్టీకి ప్రచారానికి లేదా రాజకీయ ప్రయోజనానికి అవకాశం ఇచ్చే పనికి అధికారిక కార్యక్రమాలకు గాని, ప్రభుత్వ నిధులతో సాగే వేదికలకు గానీ వినియోగించరాదని ఎన్నికల కమిషన్ ఎంసిసి ప్రభుత్వాలను కోరుతుంటుంది. 'మన్ కీ బాత్' 110 ఎపిసోడ్‌లలో ప్రభుత్వం క్రీనీడ కూడా పడకుండా చూడడం ఈ కార్యక్రమం సాధించిన భారీ విజయం అని ప్రధాని పేర్కొన్నారు. దేశ సంఘటిత బలం, విజయాలకు ఈ కార్యక్రమం ప్రసారాన్ని అంకితం చేసినట్లు మోడీ తెలియజేశారు. 'ఇది ప్రజల, వారి కోసం, వారికి ఉద్దేశించిన కార్యక్రమం' అని ఆయన చెప్పారు.'అయితే, రాజకీయ నైతిక విలువలను అనుసరిస్తూ 'మన్ కీ బాత్'ను లోక్‌సభ ఎన్నికల సమయంలో వచ్చే మూడు నెలల పాటు ప్రసారం చేయడం లేదు' అని ప్రధాని తెలిపారు. 'మనం వచ్చేసారి భేటీ అయినప్పుడు అది 'మన్ కీ బాత్'కు 111వ ఎపిసోడ్ అవుతుంది' అని మోడీ చెప్పారు. ఆ సంఖ్య ఒక సాధారణ సంఖ్య మాత్రమేనని, దానికన్నా మెరుగైనది ఏమి ఉండగలదని ఆయన అన్నారు. కాగా, ఎన్నికలలో అధికారాన్ని తిరిగి నిలబెట్టుకోగలమన్న దృఢ విశ్వాసాన్ని ప్రధాని మోడీ తరచుగా వ్యక్తం చేస్తున్నారు.2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. తొలిసారి వోటు వేయబోతున్న ప్రజలు రికార్డు సంఖ్యలో తమ వోట్లు వేయాలని కూడా మోడీ విజ్ఞప్తి చేశారు. 18వ లోక్‌సభ వారి ఆకాంక్షలకు ప్రతీక అవుతుందని ఆయన సూచించారు. యువత రాజకీయ కార్యకలాపాలలో పాల్గొంటుండడమే కాకుండా ఈ కాలంలో చర్చల గురించి చైతన్యవంతులు కూడా కావాలని ప్రధాని కోరారు. 'మీ తొలి వోటు దేశం కోసం కావాలన్నది మీరు దృష్టిలో పెట్టుకోవాలి' అని మోడీ పిలుపు ఇచ్చారు.తొలిసారి వోటు వేసేవారికి స్ఫూర్తిదాయకం కావలసిందిగా ప్రభావశీలురను, ఇతర ప్రముఖ వ్యక్తులను మోడీ కోరారు. 'మేరా పెహలా వోట్ దేశ్ కే లియే' (నా తొలి వోటు దేశం కోసమే' అనే ప్రచార కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ ప్రారంభించిందని ప్రధాని వెల్లడిస్తూ, తొలిసారి వోటర్లు గరిష్ఠ సంఖ్యలో తమ వోటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. యువ వోటర్లు ఎంత ఎక్కువగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటే దాని ప్రభావం అంత ఎక్కువగా దేశంపై పడతాయని ప్రధాని అన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే

హసన్‌పర్తి, ఫిబ్రవరి 26(పిసిడబ్ల్యు న్యూస్): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన నేదునూరి రామస్వామి కుమారుడు నేదునూరి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం మండ సాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ అధికారి కే ఆర్ నాగరాజు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తోకల లక్ష్మారెడ్డి, 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయ్యల రాంరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజన్ బాబు, తోకల లక్ష్మారెడ్డి, సునీల్, ఎర్ర ప్రకాష్ యూత్ నాయకులు చరణ్, గొర్రె కిరణ్, శేశి మరియు 65వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ, గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ బావాచి రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 26(పిసిడబ్ల్యు న్యూస్): హనుమకొండ పట్టణంలో.. కాంగ్రెస్ భవన్ సమీపంలోని ప్రధాన చౌరస్తా వద్ద మహమ్మద్ మసూద్ పాషా, సయ్యద్ యాసర్ అజిన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన గ్రీన్ బావాచి రెస్టారెంట్ ను ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు రుచికరమైన భోజనాలు అందిస్తూ.. పేరు ప్రఖ్యాతలు సాధించి ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఇవి శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా నాయకులు తోట వెంకన్న, కంటెస్టెంట్ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు, భూ హక్కు పట్టాలు పంపిణీ, వాలంటరీలకు సన్మానం: ఎమ్మెల్యే ప్రసన్న

నెల్లూరు జిల్లా, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్): కొత్తూరు జెడ్‌పిపి హైస్కూల్ నందు రాష్ట్రంలో చాలామంది ఇళ్ల స్థలాలు లేక అధికారులు చుట్టూ తిరగడం మా చుట్టూ తిరగడం జరిగాయి ఇవన్నీ చూసి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది ఈరోజు ఇందుకూరుపేట మండలాల్లో 500 మందికి పత్రాలు రిజిస్టర్డ్ కన్వేన్స్ డేట్స్ మనం ఈరోజు పంపిణీ అనంతరం శాశ్వత భూమి హక్కు భూ రక్షణ ప్రతి కుటుంబంలో భూములకు సంబంధించి అన్నదమ్ముల మధ్య అక్క చెల్లెలు మధ్య గొడవలు ఉంటాయి దాదాపు 70-80 సంవత్సరాల తర్వాత ఏ ముఖ్యమంత్రి ఏ ప్రధానమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సర్వే చేయించి పూర్తి హక్కులు మీకు కల్పించారు. ఒకసారి ఆలోచించండి రైతులు విషయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకున్నటువంటి శ్రద్ధ ఏ ముఖ్యమంత్రి తీసుకోలేదు. అసైన్మెంట్ భూములు చుక్కల ఈరోజు మీకు హక్కులు కల్పించి మీ చేతుల్లో పెడుతున్న వారిని ఎప్పుడైనా చూసారా చాలా ముఖ్యమంత్రులు చూశారు ఎవరు కూడా రైతులను మీద దృష్టి పెట్టలేదు ఇచ్చిన మాట ప్రకారం ప్రజల మధ్య ఉంటూ సంక్షేమ పథకాలు శ్రీకారం చుట్టినా విషయం కూడా మీ అందరికీ తెలుసు రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితుల్లో బాగా లేకపోయినా రెండు లక్షల 75 వేల కోట్లు విజయవాడ నుంచి పార్టీలకు అతీతంగా కులాలకు అతీతంగా రాజకీయాల్లో చేయకుండా మీ అకౌంట్ లో వేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,55,464 మంది వాలంటరీలకు 392 కోట్లు అవార్డులు ఇస్తూ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నెల్లూరు జిల్లాలో మొత్తం సేవ వజ్రా 41మంది, సేవారత్న 25మంది, సేవ మిత్ర 12,517 మంది, అక్షరాల నెల్లూరు జిల్లాలో 19 కోట్ల 64 లక్షల నగదు బహుమతిగా ఇవ్వడం జరిగింది. కోవూరు నియోజకవర్గం లో 5 మందికి సేవా వజ్ర, 25 మందికి సేవారత్న, 1074 మందికి సేవా మిత్ర అనంతరం నవరత్నాలు అమల్లో భాగస్వామ్యం వాలంటరీలు సేవలు చిరకాలం కొనసాగే లా మరింతగా ప్రోత్స హిస్తూ. సేవ వజ్రా రూ. 45 వేలు, సేవ రత్న రూ. 30 వేలు, సేవా మిత్ర 15 వేలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోవూరుయువజనవిభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, ఇందుకూరుపేట వైసీపీ మండల అధ్యక్షులు మరియు జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి ఆంధ్రప్రదేశ్ పశుగుణభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, ఇందుకూరుపేట కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ గుణపాటి సురేష్ రెడ్డి,యువనాయకులుదువ్వూరు కళ్యాణ్ రెడ్డి, మండల నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వరంగల్ పార్లమెంటు టికెట్ చింత ప్రవీణ్‌కే కేటాయించాలి

హనుమకొండ జిల్లా స్టాపర్, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికలలో వరంగల్ ఎంపీ టికెట్ ను వరంగల్ ఎంపీ అస్పిరెంటు చింతా ప్రవీణ్ కుమార్ కే కేటాయించేలా చొరవ తీసుకోవాలని కోరుతూ.. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ని, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని, వరంగల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ రాజేశ్వరరావు ని మర్యాదపూర్వకంగా కలిసి మాచర్ల చంద్రమౌళి ఎక్స్ ఎంపి టిసి వంచనగిరి శాయంపేట్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి చింత ప్రకాష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎక్స్ ఎంపీటీసీ 43వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జన్ను లక్ష్మణ్ ప్రదీప్ కుమార్ చింతరాజు జి జగదీష్ కన్నయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలతో సత్కరించి విద్యావేత్త యువ నాయకుడు క్రమశిక్షణ కలిగి కాంగ్రెస్ పార్టీలో అంచలంచెలుగా ఎదిగి ఇండియాలో యువజన నాయకుడిగా అమెరికాలో చైర్పర్సన్ మెంబర్షిప్ కమిటీ ఇండియన్ ఓవర్సీస్ లోఎన్నో పదవులు చేపట్టి న అభ్యర్థి అయిన చింత ప్రవీణ్ కు టికెట్ ఎంపీ టిక్కెట్టు ఇచ్చినట్లయితే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని తెలియజేస్తూ విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకిత భావానికి దక్కిన గౌరవం

- ఐజేయు నేత రాంనారాయణ

- మీడియా అకాడమీ ఏర్పాటుపై ప్రెస్ క్లబ్లో అభినందన కార్యక్రమం

ఖమ్మం, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): మీడియా అకాడమీ ఛైర్మన్ పదవి కె.శ్రీనివాసరెడ్డి కి ఇవ్వడం ఐదు దశాబ్దాలుగా జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి, వృత్తి నైపుణ్యానికి కృషి చేస్తున్న ఆయన అంకిత భావానికి దక్కిన గౌరవమని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తెలిపారు. మీడియా అకాడమీ పూర్వపు ఆంధ్రప్రదేశ్ తొలి అధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి పని చేశారని మరోసారి ఆయనకు గౌరవం దక్కడం పట్ల యావత్ జర్నలిస్టు సమాజల హర్షం వెలిబుచ్చుతుందని ఆయన అన్నారు. ఐజేయు జాతీయ అధ్యక్షులు, ప్రజాపక్షం సంపాదకులు కలివికోలను శ్రీనివాసరెడ్డిని మీడియా అకాడమీ చైర్మన్ గా రాష్ట్ర ప్రభుత్వం నియమించడం పట్ల ఆదివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో టియుడబ్ల్యూజె (ఐజయు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రాంనారాయణ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉద్యమంలో పనిచేసిన శ్రీనివాసరెడ్డికి జర్నలిస్టుల సమస్యలపై ప్రత్యేకమైన అవగాహన ఉన్నదని ప్రభుత్వానికి, జర్నలిస్టులకు మధ్య వారధిగా పనిచేస్తూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు, రాష్ట్ర సమాచార ప్రచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రాంనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లా జర్నలిస్టు సమాజం శ్రీనివాసరెడ్డికి ప్రతి సందర్భంలోను అండగా నిలిచిందని ఈ సందర్భంగా రాంనారాయణ గుర్తు చేశారు. హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, నైపుణ్య శిక్షణ తదితర విషయాలలో ఈ ప్రభుత్వం మరింత చేరువ కావాలని అందుకు ప్రెస్ అకాడమీ దోహదపడాలని రాంనారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె (ఐజేయు) జిల్లా కార్యదర్శి ఎనుగు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మాటిటి వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకులు ఎన్. వెంకట్రావు. ఖదీర్, నలజాల వెంకట్రావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్యులు ఆవుల శ్రీనివాస్, కనకం సైదులు, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద, నగర కార్యదర్శి చెడుకుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు వై. మాధవరావు, మోహినుద్దీన్, నామ పురుషోత్తం, మేడి రమేష్, కళ్యాణ్, కె. వెంకటేశ్వర్లు, గణేష్, సుధాకర్, సత్యనారాయణ, మధులత, డిపిఆర్వో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని పీవీ నరసింహరావు సేవలు మరువలేనివి : ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

హైదరాబాద్, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): మాజీ ప్రధాని, స్వర్గీయ పీవీ. నరిసింహారావు దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. పీ.వీకి కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించిన సందర్భంగా బోడుప్పల్‌లోని బ్రాహ్మణ భవన్‌లో అఖిల బ్రాహ్మణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆయనకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేశ ఔనత్యానికి, సమగ్రతకు కృషి చేసిన పీవీకి భారతరత్న అవార్డు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ అవార్డుతో ఆయన ఖ్యాతి మరింత పెరిగిందని, ఆయన చూపిన మార్గంలో నడుచుకుని దేశ సేవకు నడుంబిగించాలని కోరారు. దేశం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు ఎంతో మేలు చేశాయని పేర్కొన్నారు.మాజీ మంత్రి వేణుగోపాలాచారి, కార్పొరేటర్ భూక్య సుమన్, అఖిల బ్రాహ్మణ వికాస సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి నందకుమార్ జోషి, ప్రభాకర్ రావు, సుభాష్, సుధాకిరణ్, జగన్మోహన్ శర్మలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన వరంగల్ పార్లమెంట్ అస్పిరెంట్ డా. జన్ను పరంజ్యోతి, తనయుడు జన్ను చిరంజీవి భరత్



హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): హైదరాబాద్‌లోని హోటల్ తాజ్ కృష్ణ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, వరంగల్ పార్లమెంట్ అస్పరెంట్ డాక్టర్ జన్ను పరంజ్యోతి వారి తనయుడు జన్ను చిరంజీవి భరత్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సన్మానించారు. త్వరలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల గురించి చర్చించగా సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వారి వెంట పార్టీ శ్రేణులు, నాయకులున్నారు.

జనగామ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన షేక్ రిజ్వాన్ భాషా

హనుమకొండ జిల్లా స్టాపర్,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): జనగామ జిల్లా నూతన కలెక్టర్ గా వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న 2017 ఐపీఎస్ బ్యాచ్ కీ చెందిన అధికారి రిజ్వానా భాష షేక్ ఆదివారం జనగామ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఐదుగురు ఐఏఎస్ లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా రిజ్వానా భాషా జనగామకు బదిలీ కాగా, ఆదివారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

నూతన సిఐ బాబూలాల్‌ను కలిసిన జర్నలిస్టులు

సంగెం, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ బాబులాల్ ను ఆదివారం రోజున స్థానిక జర్నలిస్టుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.సిఐని కలిసిన వారిలో ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ వేల్పుల అనిల్ యాదవ్, పి సి డబ్ల్యూ న్యూస్ రిపోర్టర్ మచ్చిక వీరస్వామి గౌడ్,పబ్లిక్ న్యూస్ రిపోర్టర్ సిద్ద నాగరాజు,తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి : ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్):మారుతున్న జీవన శైలి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. నిత్యం వ్యాయామాన్ని అలవాటు చేసుకోవటంతో పాటు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వివేకానందనగర్ డివిజన్ కమలా ప్రసన్ననగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాన్ని వాణిజ్య కోణంలో కాకుండా సేవా రూపంలో చూడాలన్నారు. ప్రైవేటు దవాఖానలు ఉచిత వైద్య సేవల నిర్వహణ ద్వారా ప్రజలలో అవగాహన కల్పిస్తుండటం అభినందనీయమని, ఇలాంటి సేవలను సహచర దవాఖానాలు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ప్రజల వద్దకే వచ్చి అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రోజాదేవితో కలిసి రంగారావు , సంజీవరెడ్డి, భాస్కర్‌రావు, చంద్రకాంత్‌రావు, చంద్రశేఖర్ , తిరుపతి, శంకర్, బండప్ప, వెంకటేశ్ , డాక్టర్ శ్వేత, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం గురుకులంలో ఘనంగా వీడ్కోలు సంబరాలు

ఖమ్మం, ఫిబ్రవరి 24 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):ఖమ్మం నగరంలోని పుట్టకోట బొమ్మ కాలేజి నందు నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 10వ తరగతి, ఇంటర్ మీడియట్ విద్యార్థుల వీడుకోలు సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్. సి. ఓ ప్రత్యూష హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులు పరీక్షలు మంచిగా వ్రాసి తల్లి తండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.ప్రిన్సిపాల్ బోస్, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.తదనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులతో వున్న అనుబంధాలను, జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు.చివరగా విద్యార్థులు ఆట పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

జనంసాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ తడుక సుధాకర్‌కు ఆత్మీయ పరామర్శ

చిట్యాల, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా జనంసాక్షి స్టాఫ్ రిపోర్టర్ తడుక సుధాకర్ తండ్రి తడుక భూమయ్య (85) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలె మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని రాజ్ భవన్ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కర్రె అమర్ నాథ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కర్రె ప్రమోద్ రెడ్డిలు ఆదివారం పరామర్శించి, మృతిచెందిన భూమయ్య చిత్రపటానికి పూలమాల వేసి..ఘనంగా వారి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్):గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని బాలానగర్ ఎస్ఓటి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు ప్యాకెట్లలో 120 చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన అనంత కుమార్ బారిక్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం నగరానికి వచ్చాడు. బాలానగర్ ప్రాంతంలో కిరాణా షాపు ఏర్పాటు చేశాడు. కిరణాషాపులో విద్యార్థులు, కార్మికులకు గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నాడు. నిందితుడు ఒడిసా రాష్ట్రం నుంచి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి నగరానికి తీసుకుని వచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు.ఈ విషయం తెలియడంతో బాలానగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు విచారణ చేయగా స్కూటర్ డిక్కీలో గంజాయి చాక్లెట్లు దాచిన విషయం చెప్పాడు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

కుటుంబ సమేతంగా ఎంపీ వద్దిరాజు యాదాద్రి దివ్య క్షేత్రం సందర్శన

ఖమ్మం, ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రి దివ్య క్షేత్రాన్ని సందర్శించారు.ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మీ, ఆప్తమిత్రుడు మరికల్ పోత సుధీర్ కుమార్-నమంతలతో కలిసి యాదాద్రి (యాదగిరిగుట్ట) ఆదివారం ఉదయం దివ్య క్షేత్రాన్ని సందర్శించి శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వారికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు,వేద పండితులు మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.ఎంపీ రవిచంద్ర,వారి కూతురు డాక్టర్ గంగుల గంగాభవాని, సుధీర్ కుమార్ తమ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు.వేద పండితులు కండువాలతో సత్కరించి,ఆశీర్వచనాలు పలికారు,స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న వారిలో సుధీర్ కుమార్ కూతురు అపూర్వ, గంగాభవాని కుమారులు సనవ్, సౌరవ్ తదితరులున్నారు.

నవాబుపేట,మొగుళ్ళపల్లి గ్రామాల మధ్య అసంపూర్తిగా వదిలి వేసిన రోడ్డు పనులు

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నేరెళ్ల ఓదెలు

చిట్యాల, ఫిబ్రవరి25 (పిసిడబ్ల్యూ న్యూస్):వర్షాకాలం లో కురిసిన భారి వర్షాల కారణంగా చలి వాగు వుద్రితికి నవాబుపేట మరియు మొగుళ్ళపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు కొట్టుకు పోయింది,కొట్టుకుపోయిన రోడ్డు స్థానంలో మళ్ళీ సి.సి. రోడ్డు వేయించటం జరిగింది,ఆ రోడ్డు వేయించి ఐదు నెలలు పూర్తి కావస్తున్న అట్టి సి.సి.రోడ్డుకు ఇరువైపులా మొరం పోయక పోవడమే కాకుండా, కొంత వరకు బండరాళ్ళ తో పేర్చిన రాళ్ల తెట్టెకు సిమెంట్ వర్క్ చేయకుండా అసంపూర్తిగా వదిలివేశారు.అక్కడ మిగిలిపోయిన రాళ్ళను రోడ్డు ప్రక్కనే వదిలి వేశారు,దీనివల్ల వాహనదారులకి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది,అలాగే మళ్ళీ వర్షాకాలంలో కురిసే వర్షాలకు రాళ్ల తో పేర్చిన రాళ్ల తెట్టె కొట్టుకు పోయే అవకాశం ఉంటుంది, కావున ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్ ద్వార ఆ యొక్క పని పూర్తి చేయించాలని యం.ఆర్.పి.యస్. మండల అధ్యక్షులు నేరెళ్ళ ఓదెలు డిమాండ్ చేశారు.

లీలా మోహన్ జీవితం ఎంతో మందికి ఆదర్శం

- మేయర్ పునుకొల్లు నీరజ

- అన్నం సేవా ఫౌండేషన్‌లో ఘనంగా లీల మోహన్ 25వ వర్ధంతి

ఖమ్మం,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): లీలా మోహన్ జీవితం ఎంతోమందికి ఆదర్శమని ఖమ్మం నగర మేయర్ పూనుకొలు నీరజ అన్నారు. ఖమ్మం నగరంలోని బేకులపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న అన్నం సేవా ఫౌండేషన్ అనాథ శరణలయంలో దివంగత లీలా మోహన్ 25వ వర్ధంతి కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వర్ధంతి సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ నీరజ అన్నం ఫౌండేషన్ లో ఉన్న మానసిక వికలాంగులు,అనాధలకు అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆమె లీలా మోహన్ వర్ధంతిని ఉద్దేశించి మాట్లాడారు. లీలా మోహన్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ మాజీ జిల్లా అధ్యక్షులుగా ఎనలేని సేవచేశారని మేయర్ తెలిపారు. ఇంజనీర్లు తమ వృత్తి పట్ల నిబద్ధతో పనిచేయాలని తపించేవారని గుర్తు చేశారు. ఇంజనీర్లు తమ వృత్తితో పాటుగా సమాజికసేవ దృక్పథం కలిగి ఉండాలని అభిలాషించేవారని అన్నారు. ప్రస్తుత రోజుల్లో చిన్న, చిన్న మనస్పర్థలతో కుటుంబాలే విచ్ఛినమవుతున్న తరుణంలో,తన చిరకాల మిత్రుడు లీలా మోహన్ వర్ధంతిని గుర్తుపెట్టుకొని జర్నలిస్టులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం హర్షణీయం అన్నారు. తన స్నేహితున్ని స్మరిస్తూ ప్రతి సంవత్సరం వర్ధంతి వేడుకను నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల లెక్చరర్ వడపు అరుణకుమారి, అభిప్రయ్, జిల్లా నాయకులు గుద్దేటి రమేష్ బాబు, రామిశెట్టి విజేత, ముత్యాల కోటేశ్వరావు, టీఎస్ చక్రవర్తి, కొరకొప్పుల రాంబాబు, ఉత్కంఠం శ్రీను, పానకాలరావు, జీవన్ రెడ్డి, బిక్కి గోపి, పేరబోయిన తిరుపతిరావు, డి. రామకృష్ణ, పులి శ్రీను, వెంకటకృష్ణ, నల్లమోతు శ్రీను, మురళి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతర నిర్వహణ సక్సెస్‌లో ఎస్ఐ తీగల మాధవ్ గౌడ్ సేవలు ప్రశంసనీయం

చిట్యాల, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):ముల్కలపల్లి-మొగుళ్ళపల్లి మినీ మేడారం జాతర సక్సెస్ లో ఎస్ఐ తీగల మాధవ్ గౌడ్ సేవలు ప్రశంసనీయమని, విధి నిర్వహణలో ఆయన జాతర సజావుగా సాగేటట్లు చేసిన కృషి ఎనలేనిదని భక్తులు పేర్కొంటున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో..భక్తులు వనదేవతలైన శ్రీ సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు చేసిన సేవలు మరువలేనివని, ఈనెల 21 నుంచి 24 వరకు జరిగిన మినీ మేడారం జాతరలో ఎలాంటి గొడవలు జరగకుండా..ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా..తగు జాగ్రత్తలను తీసుకొని పలువురి ప్రశంసలు అదునుకుంటున్నారు. ఆయన మినీ మేడారం జాతరను సక్సెస్ చేసిన తీరు పట్ల ప్రజా ప్రతినిధులు, అధికారులు, భక్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ తీగల మాధవ్ గౌడ్ మాట్లాడారు. మినీ మేడారంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులకు సహకరించిన భక్తజనానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నిలబెట్టుకుంటాం

- గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం ఎమ్మెల్యే - పలు గ్రామాలల్లో రూ.1.65 కోట్లతో సిసి రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర



జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్):ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, అన్ని గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని భూపాలపల్లి రూరల్ మండలంలోని నాగారం, ఆజంనగర్, నందిగామ, పంబాపూర్, దీక్షకుంట, దూదేకులపల్లి, గొల్లబుద్దారం, రాంపూర్, కమలాపూర్, కొంపల్లి, గొర్లవీడు, వజినేపల్లి గ్రామాలల్లో ఎస్.ఆర్.ఈ.జీ. ఎస్ పథకం ద్వారా 2023-24 సంవత్సరానికి గాను రూ.1.65 కోట్లతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు.అనంతరం ఆజంనగర్ గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్లో సమగ్ర శిక్షా నిధుల ద్వారా 2023-24 సంవత్సరానికి గాను రూ.13.5 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సైన్స్ ల్యాబ్ కు కూడా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని అన్నారు.అదేవిధంగా, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు విద్యుత్ సౌకర్యం మరియు రూ.500 వందలకే వంట గ్యాస్ అమలుకు త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.ఇళ్ళు లేని ప్రతీ ఒక్కరికీ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలిస్తామని వెల్లడించారు.అన్నిగ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, గత పాలకుల కంటే భిన్నంగా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం కొంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు పలువురికి కుట్టు మిషన్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

ఈ భవనం శిథిలావస్థకు చేరిందా ?

- అధికారుల నిర్లక్ష్యానికి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

- నూరేళ్ల చరిత్రకు స్వస్తి పలుకుతున్నారా !

తొర్రూరు,ఫిబ్రవరి 25(పిసిడబ్ల్యూ న్యూస్): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన నెల్లికుదురు గ్రామం. గత 70 సంవత్సరాల క్రితమే నెల్లికుదురు లో పోలీస్ సర్కిల్ కార్యాలయం ఉండేది . నెల్లికుదురు సెంటర్ కి పక్కనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రహదారుల మరియు భవనముల శాఖ విశ్రాంతిభవనాన్ని ఆ రోజుల్లోనే నిర్మింప చేశారు. చెన్నూరు నియోజకవర్గం ఉన్నప్పుడు నెల్లికుదురు,తొర్రూర్‌లోనే ఉండేది. జిల్లాల విభజనలో నెల్లికుదురు మండలం మహబూబాబాద్ డివిజన్ లోకి మారిపోయింది. ఒకప్పుడు ఎంతో ప్రసిద్ధిగాంచిన ఈ విశ్రాంతిభవనం అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతుందా అనే విధంగా ఈ దృశ్యాలను చూస్తే మీకే అర్థమవుతుంది. ఆలనా పాలనా లేక చెత్తాచెదారంతో నిండి ఉన్న ఈ భవనాన్ని శుభ్రం చేసి అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవనం ప్రాంగణంలో ఉన్న దుస్థితిని మీరే గమనించండి. అధికారులు చొరవ తీసుకొని ప్రతిరోజు శుభ్రంగా ఉంచే విధంగా చూడాలని కోరుతున్నారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

నెల్లూరు జిల్లా, ఫిబ్రవరి 25 (పిసిడబ్ల్యూ న్యూస్): జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం 30 డివిజన్ పరిధిలోని నక్క గోపాల్ నగర్ నందు పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి మరియు నగర ఇంచార్జి వేములపాటి విజయ్ కుమార్ సూచనలతో జనసేన పార్టీ మహిళా నాయకురాలు యాదవ్ ఆధ్వర్యంలోని జండా ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది. నాగరత్నం యాదవ్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు ఏ నిర్ణయం తీసుకున్నా అది రాష్ట్ర ప్రజల కోసం అని నెల్లూరు రూరల్ తెలుగుదేశం జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కోటంరెడ్డి గెలుపు కోసం అందరం కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు. తిరుమలలో అమ్ముకునే వాళ్ళు కూడా పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడుతుంటే దెయ్యాల,వాయించినట్లుగా ఉంది ప్రభుత్వం.ఐరన్ లెగ్ లేడీ ఫస్ట్ నగిరి లో గెలిచి అభివృద్ధి చేసారో రాష్ట్ర ప్రజలకు తెలుసు నగిరి ప్రజలకు కూడా తొందర్లో తరిమికొట్టే రోజు వస్తుంది. అనంతరం జనసేన పార్టీ నెల్లూరు జిల్లా అధికారి కారపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రావణ రాజ్యం నడుస్తుందని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు చాలా బాధలు పడుతున్నారని ప్రజలు సుఖ సంతోషాలతో బ్రతకట్లేదని జనసేన తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు.స్థానిక వీరమహిళలు నందిని, రేణుక,ప్రసన్న, ఇందిరా, కస్తూరి,కృష్ణవేణి, జనసేన నాయకులు సుందర్ రామిరెడ్డి, అలహరి సుధాకర్,వై రవికుమార్,కే కృష్ణారెడ్డి,మార్కెట్ సురేష్, పి చంద్రశేఖర్ రెడ్డి,గుడి హరికుమార్ రెడ్డి,టిడిపి శ్రీనివాసులు రెడ్డి,గునుకుల కిషోర్, టిఎన్ఎస్ఎఫ్ ఆశిక్, చిత్తూరురాము, నరసింహ,కోన రవిశంకర్,మేకల ప్రవీణ్,జనసైనికులు అధిక సంఖ్యలో వీరమహిళలు పాల్గొన్నారు.